సాక్షి
కామారెడ్డి
గురువారం । 2 । అక్టోబర్ । 2025



దళారులను నమ్మొద్దు

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అధికారులు సూచించారు. పలుచోట్ల కొను గోలు కేంద్రాలను ప్రారంభించారు.

- IIIలో ▸



దుర్గమ్మకు కుంకుమ పూజలు

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పలుచోట్ల కుం కుమ పూజలు, హోమాలు చేశారు.

- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 /20.8

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో 30, 30(ఏ) పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈనెలాఖరు వరకు జిల్లాలో 30, 30(ఏ) పోలీసు యాక్ట్ అమలులో ఉం టాయని ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహిం చరాదని పేర్కొన్నారు. నిబంధనలను అతి క్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చ రించారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



భిక్కనూరు: అంతంపల్లి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో బుధవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అద నపు కలెక్టర్ విక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొ న్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో డీసీఎస్‌వో వెంకట్, డిప్యూటీ తహ సీల్దార్ కిష్టయ్య, అధికారులు నరేందర్, మల్లే శం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరుకాని పీవోలకు షోకాజ్ నోటీసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన శిక్షణకు గైర్హాజ రైన ప్రిసైడింగ్ అధికారులకు షోకాజ్ నోటీ సులు జారీ అయ్యాయి. ఈనెల 26 న మం డల స్థాయిలో జరిగిన శిక్షణ కార్యక్రమాలకు 68 మంది గైర్హాజరయ్యారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి ఎస్.రాజు వారికి షోకాజ్ నోటీ సులు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

రావణదహనం ఏర్పాట్ల పరిశీలన



బాన్సువాడ రూరల్: దసరా పండుగ సంద ర్భంగా ఏటా బాన్సువాడలోని మినీ స్టేడియం లో నిర్వహించే రావణ దహనం ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలిం చారు. నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మండల నాయకులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని ఎంతోమంది ఆరాటపడ్డారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ పదవులలో రిజర్వేషన్ దేనికి అనుకూలిస్తే దానికి పోటీ చేయాలని భావించారు. కొందరైతే రెండుమూడేళ్లుగా జనంలో ఉంటున్నారు. అలాంటి పలువురు నేతల ఆశలను రిజర్వేషన్లు గల్లంతు చేశాయి. దీంతో వారు రాజకీయాలపై వైరాగ్యంతో ఉన్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



గిట్లయిపాయె!

- కలిసిరాని రిజర్వేషన్లు
- పలువురు నేతలకు తప్పని నిరాశ
- రాజకీయాలపై వైరాగ్యం

జిల్లాలోని వివిధ మండలాల్లో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల నుంచి ఎన్నికల బరిలో దిగాలని చాలామంది ఆరాటపడ్డారు. కామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి జెడ్పీటీసీగా పోటీ చేయాలని భావించారు. అది కాకుంటే ఎంపీపీ పీఠం మీద కూర్చోవాలని కలలుగన్నారు. అయితే జెడ్పీటీసీ ఎస్సీ జనరల్, ఎంపీపీ ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో ఆయన ఆశలు ఆవిరయ్యాయి. మాచారెడ్డి మాజీ ఎంపీపీ నర్సింగరావు మూడు పర్యాయాలు ఎంపీపీగా, ఒక పర్యాయం వైస్ ఎంపీపీగా, ఆయన భార్య అనిత ఒకసారి జెడ్పీటీసీగా పనిచేశారు. ఈసారి రిజర్వేషన్ కలిసొస్తే మరోసారి ఎంపీపీ లేదా జెడ్పీటీసీ చాన్స్ తగిలేది. అయితే ఎంపీపీ, జెడ్పీటీసీ రెండూ ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో ఆయన నిరాశ చెందారు. మాచారెడ్డి జెడ్పీటీసీగా పనిచేసిన మిన్కూరి రాంరెడ్డికి కూడా నిరాశే ఎదురయ్యింది. భిక్కనూరు నుంచి జెడ్పీటీసీగా ఎంపికైతే జెడ్పీ చైర్మన్ అవకాశం దక్కుతుందని ఆశించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డికి సైతం రిజర్వేషన్ కలిసిరాలేదు. ఈ మండలంలో పలువురు నేతలు జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెట్టుకోగా వారికి రిజర్వేషన్ అనుకూలించలేదు. జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు బీసీలకు దక్కడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు పోటీకి రెడీ అవుతున్నారు. అధికార పార్టీ మాజీ ఎంపీపీ బల్యాల రేఖను బరిలో దింపే అవకాశం ఉంది.

బీబీపేట నుంచి మరోసారి పోటీ చేయాలనుకున్న బీఆర్‌ఎస్‌కు చెందిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్‌కు రిజర్వేషన్ కలిసిరాలేదు. అయితే ఆయన భార్యకు అవకాశం దక్కవచ్చు. నాగిరెడ్డిపేట నుంచి బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ఈసారి కూడా జెడ్పీటీసీ లేదంటే ఎంపీపీ కావాలని ఆరాటపడ్డారు. అయితే రెండు పదవులు ఎస్సీలకు కేటాయించడంతో ఆయన ఆశలు గల్లంతయ్యాయి. ఎల్లారెడ్డి నుంచి జెడ్పీటీసీగా బరిలో దిగి, జెడ్పీ చైర్మన్ పదవి పొందాలని ఆరాటపడిన మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణదీ ఇదే పరిస్థితి. ఇక్కడ జెడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది.

లింగంపేట నుంచి జెడ్పీటీసీగా పోటీ చేయాలని పలువురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలు ఆశపడ్డారు. కానీ జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులు బీసీలకు దక్కడంతో వారికి అవకాశం చేజారింది. పాల్వంచ జెడ్పీటీసీ స్థానం బీసీలకు, ఎంపీపీ బీసీ మహిళకు కేటాయించారు. రాజంపేట మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ ఎస్టీలకు రిజర్వ్ అవడంతో ఇక్కడి నుంచి పోటీ చేయాలని ఆరాటపడిన నల్లవెల్లి అశోక్, యాదవరెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణారావు, ప్రణీత్‌రెడ్డి తదితరులకు నిరాశే ఎదురైంది. బాన్సువాడ జెడ్పీటీసీ బీసీలకు రిజర్వ్ కావడంతో అక్కడి నుంచి పోటీ చేయాలని ఆశించిన గోపాల్‌రెడ్డి ఆశలు గల్లంతయ్యాయి. నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు బీసీ మహిళలకు కేటాయించడంతో అక్కడ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులకు పోటీ చేసే అవకాశం మిస్సయ్యింది. రామారెడ్డిలో జెడ్పీటీసీగా మరోసారి పోటీ చేయాలని ఆరాటపడిన మోహన్‌రెడ్డికి రిజర్వేషన్ కలిసిరాలేదు. ఎంపీపీ, జెడ్పీటీసీ రెండు కూడా బీసీ మహిళకు రిజర్వ్ అవడంతో ఆయన పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ కాంగ్రెస్ సీనియర్ నేత గిరెడ్డి మహేందర్‌రెడ్డి ఎంపీపీ కావాలనుకున్నా రిజర్వేషన్ కలిసిరాలేదు.

జనరల్ స్థానాలలో పోటాపోటీ..

తాడ్వాయి మండల జెడ్పీటీసీ స్థానం జనరల్‌కు, ఎంపీపీ జనరల్ మహిళకు రావడంతో ఇక్కడ టికెట్లు ఆశించేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి పలువురు నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. అధికార పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి లేదా ఆయన సతీమణి మంజులారెడ్డి పోటీచేస్తారన్న ప్రచారంతో మండలంలో రాజకీయం వేడెక్కింది. పిట్లం జెడ్పీటీసీ జనరల్ మహిళకు, ఎంపీపీ జనరల్‌గా ఉండడంతో ఇక్కడ టికెట్ల కోసం తీవ్ర పోటీ ఉండే అవకాశం ఉంది. ప్రధాన పార్టీల నుంచి దాదాపు పది మంది టికెట్ రేసులో ఉన్నారు. పలువురు మండల స్థాయి నాయకులు తమ కుటుంబ సభ్యులను బరిలో నిలపనున్నారు. సదాశివనగర్ మండలంలో జెడ్పీటీసీ జనరల్ మహిళ, ఎంపీపీ జనరల్‌కు రావడంతో ఇక్కడ అన్ని పార్టీల్లోనూ పోటీ ఉండనుంది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారితో పాటు బీసీ నాయకులు పలువురు ఆయా పార్టీల నుంచి టికెట్లు ఆశిస్తున్నారు. దోమకొండ మండల జెడ్పీటీసీ స్థానం జనరల్ మహిళకు, ఎంపీపీ జనరల్‌కు వచ్చాయి. జెడ్పీటీసీగా పోటీ చేయాలనుకున్న నేతలు మహిళలకు రిజర్వ్ కావడంతో తమ కుటుంబ సభ్యులను బరిలో నిలిపే అవకాశం ఉంది.

కొందరికి కలిసొచ్చింది..

మహ్మద్‌నగర్ మండలం నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ శోభ మరోసారి పోటీ చేయడానికి రిజర్వేషన్ అనుకూలించింది. గాంధారి మండలంలో జెడ్పీటీసీ బీసీ మహిళకు, ఎంపీపీ బీసీ జనరల్‌కు రావడంతో ఇక్కడ పోటీ తీవ్రంగా ఉండనుంది. మండలంలో పలువురు మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు బరిలో నిలిచే అవకాశం ఉంది. లింగంపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్ తెలంగాణ జాగృతిలో యాక్టివ్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఇండిపెండెంట్‌గా బరిలో దిగే అవకాశం ఉంది.

నేడు విజయదశమి

- సొంతూళ్లకు చేరుకున్న జనం
- జిల్లావ్యాప్తంగా వేడుకలకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : చెడుపై మంచి విజయం సాధించిన రోజే విజయదశమి. సకల శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు మహిషాసురుడనే రాక్షసుడిని సంహరించిన రోజు ఇది. రావణాసురుడిపై రాముడు విజయం సాధించిన సుదినం.. ఈ విజయాలకు ప్రతీకగా దేశమంతా జరుపుకునే పండుగే దసరా. గురువారం విజయదశమి. పండుగ నేపథ్యంలో అంతటా సందడి నెలకొంది. బతుకుదెరువు కోసం, ఉద్యోగాల కోసం పట్టణాలు, దూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా దసరా సెలవుల్లో ఊళ్లకు చేరుకున్నారు. బతుకమ్మ పండగ కోసం ముందుగానే చాలామంది వచ్చారు. దీంతో ఏ ఇంటికి వెళ్లినా సందడి కనిపిస్తోంది. దసరా పండుగ నాడు కొత్త దుస్తులు ధరించి పాలపిట్టను చూడడానికి పచ్చని పొలాల వెంట వెళ్లడం ఆనవాయితీ. పాలపిట్టను దర్శించుకున్న తర్వాత జమ్మి వృక్షానికి పూజలు చేస్తారు. ఆలయాలకు వెళ్లి విజయాలను ఇవ్వాలని భగవంతుడిని వేడుకుంటారు. అనంతరం స్నేహితులు, బంధుమిత్రులకు జమ్మి ఆకు పంచుతూ అలయ్ బలయ్ తీసుకుంటారు. పండగ సందర్భంగా ఆయుధ, వాహన పూజలు నిర్వహిస్తారు.



మద్యం, మాంసానికి చిక్కు..

దసరా పండగ రోజున ఇంటింటా మాంసాహార భోజనాలు, మద్యం సేవించడం ఆనవాయితీగా నడుస్తోంది. అయితే ఈసారి గాంధీ జయంతి రోజునే దసరా పండగ రావడంతో మాంసం, మద్యం అమ్మకాలకు బ్రేక్ పడింది. దీంతో చాలా మంది ముందు రోజే అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు.

ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్

- ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాల సభ్యులకు బుధవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలు బాధ్యత ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ బృందాలపై ఉందన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా జోనల్ అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి..

సర్పంచ్, వార్డు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. గుర్తించిన కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించడానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. అభ్యర్థులకోసం ఫారాలు, నామినేషన్ పత్రాలు, ఓటరు లిస్టులను సిద్ధం చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సంబంధిత రూట్ మ్యాప్‌లను రూపొందించి పంపాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను జిల్లా కేంద్రం నుంచి స్వీకరించడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. సర్పంచ్ అభ్యర్థులు తహసీల్దార్ వద్ద, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోటీదారులు సంబంధిత ఆర్డీవో వద్దనుంచి అవసరమైన అన్ని రకాల అనుమతులు పొందాల్సి ఉంటుందని తెలిపారు. ర్యాలీలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి అనుమతులను సంబంధిత పోలీసు అధికారుల నుంచి తీసుకుని తహసీల్దార్‌లకు సమర్పించాలని సూచించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు, సమస్యలు, ఫిర్యాదులు ఉన్నట్లయితే (గ్రీవెన్స్ సెల్) 99087 12421 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్ నాయక్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీపీవో మురళి, డీఈవో రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాబ్ది ప్రస్థానంలో కాషాయం రెపరెపలు

- ఇందూరు జిల్లాలో ఉరకలెత్తుతున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్
- కందకుర్తిలో సంఘ్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ మూలాలు
- హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో కొనసాగుతున్న స్మృతి మందిర నిర్మాణం
- సంఘ్ ఆధ్వర్యంలో 'పంచ పరివర్తన్' సూత్రాలతో శతాబ్ది ఉత్సవాలు
- నేడు 101వ వసంతంలోకి అడుగు పెట్టనున్న ఆర్‌ఎస్‌ఎస్

వందేళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) గురువారం 101వ వసంతంలోకి అడుగు పెట్టింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక, సాంస్కృతిక సంస్థగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్‌ను 1925లో విజయదశమి రోజున నాగ్‌పూర్‌లో ఐదుగురు పిల్లలతో కేశవ బలిరామ్ హెడ్గేవార్ స్థాపించారు. తరువాత కొన్నేళ్లకు ఇందూరు నగరంలోని గాజుల్‌పేట దత్తమందిర్‌లో 'ఇందూరు శాఖ'ను ప్రారంభించారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు నగరంలో 65 చోట్ల ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు నడుస్తున్నాయి. ప్రతి బస్తీలో శాఖలు ఉండడంతో తెలంగాణలోనే సంపూర్ణ శాఖలున్న మొదటి నగరంగా నిలిచింది. జిల్లాలోని ఇతర మండలాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున శాఖలు విస్తరించాయి.

✣ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో 'పంచ పరివర్తన్' పేరిట (కుటుంబ ప్రబోధన, సామాజిక సమరసత, స్వ ఆధారిత జీవనం, బాధ్యతాయుత పౌరవిధులు, పర్యావరణ పరిరక్షణ) అనే అంశాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. మరో నెలపాటు ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి.

✣ హెడ్గేవార్ తాతగారైన నరహరి శాస్త్రి 169 సంవత్సరాల క్రితం రెంజల్ మండలం కందకుర్తి నుంచి వేదపండితులకు ప్రాధాన్యత ఇచ్చే భోంస్లే సంస్థానమైన నాగ్‌పూర్‌కు వలస వెళ్లారు. ఈ క్రమంలో కందకుర్తిలో స్మృతిమందిరంగా ఉన్న వారి ఇంటి వద్ద ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 1989 నుంచి శ్రీ కేశవ శిశు విద్యామందిర్ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భరతమాత విగ్రహం, హెడ్గేవార్ కులదైవమైన చెన్నకేశవనాథ్ విగ్రహం, హెడ్గేవార్ విగ్రహం ప్రతిష్ఠించారు. కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో గోదావరి హారతి కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు.


కాగా శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో రూ.12 కోట్ల వ్యయంతో భారీ స్మృతి మందిరం నిర్మిస్తున్నారు. దీని వద్దనే గోదావరి ఒడ్డున మరో 10 ఎకరాల్లో కేశవ స్ఫూర్తి కేంద్రం, పాఠశాల, వసతిగృహం, భరత మాత ఆలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. పేద పిల్లలు, రైతులు, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించారు. పాఠశాలలో ముస్లిం విద్యార్థులు సైతం విద్యనభ్యసిస్తున్నారు.



ఘోష్ ప్రదర్శన ఇస్తున్న స్వయం సేవకులు

కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న కందకుర్తి గ్రామాన్ని ఇప్పటికే పలువురు సర్‌సంఘ్ చాలక్ (ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్)లు సందర్శించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న స్మృతి మందిరం ప్రారంభానికి ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్‌జీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్వరలో హాజరు కానున్నారు.

✣ కేశవ్ బలిరాం పంత్ హెడ్గేవార్ నాగ్‌పూర్‌లోనే జన్మించారు. కోల్‌కతాలో వైద్య విద్యనభ్యసించారు. బెంగాల్‌లో అనుశీలన సమితి, జుగాంతర్ మొదలైనవాటి ప్రభావానికి లోనయ్యారు. కాంగ్రెస్, హిందూ మహాసభలలో సభ్యుడిగా పనిచేశారు. దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నందుకు రెండుసార్లు జైలు శిక్ష అనుభవించారు. హెడ్గేవార్ వైద్య విద్య అభ్యసించినా.. సమాజంలో ఉన్న దుర్గతులపై ఎక్కువగా దృష్టి సారించారు. దేశం విదేశీయుల చేతుల్లోకి వెళ్లిపోవడానికి హిందువులు కులాలవారీగా విడిపోయి కలహించుకోవడం, ఆత్మన్యూనతలో మునిగిపోవడం కారణాలుగా భావించిన ఆయన.. సమాజంలో ఐక్యత కోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకుని ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారు. ఆయన నాటిన విత్తనం మొలకెత్తి అంచెలంచెలుగా ఎదిగి నేడు వటవృక్షమైంది. హెడ్గేవార్ 1940 జూన్ 21న మరణించారు.



వందేళ్లలో తొలిసారి..

- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 237.9 టీఎంసీల ఇన్‌ఫ్లో
- గతంలో 1983లో 163 టీఎంసీలు చేరిక
- నెలన్నరగా పరవళ్లు తొక్కుతున్న మంజీర నది

ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరదలు వచ్చాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 44 రోజుల వ్యవధిలోనే 237.9 టీఎంసీల ఇన్‌ఫ్లో రావడం గమనార్హం. వందేళ్ల చరిత్ర కలిగిన ప్రాజెక్టుకు ఈ స్థాయిలో వరదలు రావడం ఇది తొలిసారి..

– నిజాంసాగర్



నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు

నిజాంల కాలంలో మంజీర నదిపై అచ్చంపేట వద్ద భారీ జలాశయం నిర్మాణం ప్రారంభించారు. 1923లో ప్రారంభమైన నిర్మాణం 1931లో పూర్తయ్యింది. కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలతో పాటు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురిసే వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతుంది.

ఆగస్టు 18న ప్రారంభమైన ఇన్‌ఫ్లో..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది ఆగస్టులో ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. ఆ నెలలో భారీ వర్షాలు కురవడంతో 111.53 టీఎంసీల నీరు వచ్చి చేరింది. సెప్టెంబర్‌లోనూ వరుణుడి జోరు కొనసాగడంతో మరో 126.41 టీఎంసీలు జత కలిసింది. మొత్తం 44 రోజుల వ్యవధిలో 237.94 టీఎంసీల ఇన్‌ఫ్లో రావడం గమనార్హం. వందేళ్ల ప్రాజెక్టు చరిత్రలో ఇది రికార్డ్ కావడం గమనార్హం. అంతకుముందు 1983 సంవత్సరంలో నిజాంసాగర్ ప్రాజెక్టు భారీ స్థాయిలో వరదలు వచ్చాయి. ఆ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కలిపి 163 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఆ తర్వాత ఈ స్థాయిని మించి వరదలు రావడం ఇదే తొలిసారి.

ఒకరోజులో..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1962 సంవత్సరంలో భారీ వరదలు వచ్చాయి. ఒక రోజులో ప్రాజెక్టు చరిత్రలో గరిష్టంగా 4.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదయ్యింది. 1988 సంవత్సరంలో 2 లక్షల క్యూసెక్కులు వచ్చింది. ఆ తర్వాత ఎప్పుడూ ఒక రోజులో గరిష్ట ఇన్‌ఫ్లో 2 లక్షల క్యూసెక్కులు దాటలేదు. ఈసారి అగస్టు 28న 2.56 లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది.

నిజాంసాగర్‌లోకి లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు బుధవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,03,716 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 15 గేట్లను ఎత్తి 77,329 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1,402.40 అడుగులు (14.486 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

రికార్డు స్థాయిలో వరదలు..



మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరదలు వచ్చాయి. ఆగస్టు నెల 18 నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా నిర్విరామంగా నీటిని విడుదల చేస్తున్నాం. ఇప్పటివరకు 237.947 టీఎంసీల నీరు ఇన్‌ఫ్లోగా రాగా 223.778 టీఎంసీలను విడుదల చేశాం. నీటి ప్రవాహం మొదలైన నాటినుంచి అప్రమత్తంగా ఉండి, ఇన్‌ఫ్లోలను గమనిస్తూ నీటిని విడుదల చేస్తున్నాం.

– సోలోమన్, నీటిపారుదలశాఖ ఈఈ, నిజాంసాగర్









పేదింట్లో చదువుల 'భాగ్య'ం!

- ఎంబీబీఎస్ సీటు సాధించిన చాయ్‌వాలా కుమార్తె
- ఉన్నత చదువులే లక్ష్యమంటున్న విద్యార్థిని


తల్లిదండ్రులతో భాగ్యలక్ష్మి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వాళ్లది నిరుపేద కుటుంబం. తండ్రి హోటల్‌లో చాయ్ తయారు చేస్తాడు. తల్లి బట్టలు కుడుతుంది. ముగ్గురు కూతుళ్లు. ఇద్దరిని టెన్త్, ఇంటర్ వరకు చదివించి పెళ్లి చేసేశారు. చిన్న కూతురు ప్రభుత్వ బడిలో పదో తరగతి వరకు చదివి 9.8 జీపీఏ సాధించింది. ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన ఆమె, పట్టుదలతో చదివి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌కు చెందిన మడపతి నాగయ్యస్వామి, శ్రీశైల దంపతుల కూతురైన భాగ్యలక్ష్మి సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొని పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించింది. దీంతో బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడికి వెళ్లి జాయిన్ అయిన వారం రోజులకే ఆ చదువు తనకొద్దంటూ ఇంటికి వచ్చేసింది. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అప్పటికే ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవుతుండడంతో కామారెడ్డిలోని సాందీపని కాలేజీలో చేర్పించారు. తండ్రి నాగయ్య స్వామి కామారెడ్డి పట్టణంలోని ఓ హోటల్‌లో చాయ్ తయారు చేసే పనిలో చేరాడు. తల్లి ఇంటి దగ్గర ఉంటూ కూతురు చదువు చూసుకుంది. బైపీసీ బాగా చదివితే డాక్టర్ అవుతావంటూ ప్రోత్సహించింది. ఇంటర్‌లో 992 మార్కులు వచ్చాయి. కాలేజీ అధ్యాపకుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతో భాగ్యలక్ష్మి నీట్ రాసి 406 మార్కులు సంపాదించింది. దీంతో మొదట నిర్మల్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. రెండో విడత కౌన్సిలింగ్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌లో సీటు సాధించింది.

అమ్మ ప్రోత్సాహం ఎక్కువ..

మా నాన్న మా కోసం ఎంతో కష్టపడతాడు. అమ్మ రోజూ చదువుకోమంటూ ఎంతగానో ప్రోత్సహించింది. మెడిసిన్ సీటు సాధించాలంటూ నిత్యం గుర్తు చేస్తూ ఎంకరేజ్ చేసింది. సాందీపని కాలేజీ అధ్యాపకుల సహకారంతో మెడిసిన్ సీటు సాధించాను. ఎంబీబీఎస్ చదివిన తర్వాత కచ్చితంగా పీజీ కూడా సాధిస్తా. న్యూరో లేదా కార్డియాలజీ విభాగంలో సీటు సాధించి మంచి డాక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తా.

– భాగ్యలక్ష్మి, విద్యార్థిని

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు


మద్దికుంటలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలలో స్వయం సేవకులు


తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో ర్యాలీ

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో పలుచోట్ల బుధవారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ నేతలు మాట్లాడుతూ.. ఈ వందేళ్లలో ఆపత్కాలంలో అందరికీ అండగా నిలిచామని పేర్కొన్నారు. దేశ సేవే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో ఎవరైనా చేరి దేశ సేవ చేయొచ్చని, అందరికీ తలుపులు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి దేశభక్తి ఉండాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను కేశవ్ బలిరాం హెడ్గేవార్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 1925 విజయదశమి రోజున మొదలు పెట్టారని.. నేడు శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.


మహమ్మద్‌నగర్‌లో మాట్లాడుతున్న తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్


లింగంపేటలో.. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహ కార్యవాహ పాపయ్యగారి గోవర్ధన్‌రెడ్డి

దసరా ఉత్సవాలకు ముస్తాబైన బురుజు



దోమకొండ: దోమకొండలోని బురుజును విద్యుత్ దీపాలతో దసరా కోసం ముస్తాబు చేశారు. గురువారం బురుజుపై జాతీయ జెండాను ఎగురవేయడానికి ఏర్పాట్లు చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా ఇక్కడ జాతీయ జెండాను ఎగురవేయడానికి జనం భయపడేవారు. ఇక్కడి జనం స్వాతంత్రం కోసం అనేక పోరాటాలు చేశారు. నిజాం కాలం నుంచే ఇక్కడ దసరా ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ ఇక్కడ మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేయటానికి నిజాం పాలకులకు భయపడేవారు. దోమకొండలో 1947 సెప్టెంబర్ 8న ఇక్కడి పాలకులకు తెలవకుండా 23 ఫీట్ల పొడవు, 46 ఫీట్ల వెడల్పుతో జాతీయ జెండాను తయారు చేసి 12 మీ. పొడవు, 2 మీ. వెడల్పు గల దుంగ కర్రకు పెట్టి అప్పటి యువకులు ఎగురవేశారు. దీంతొ ఇక్కడి యువకులు కొందరు జైలు పాలయ్యారు. అప్పటి నుంచి ప్రతి దసరా రోజున జాతీయ జెండాను ఎగురవేయటం ఆనవాయితీగా వస్తోంది. దసరా ఉత్సవంలో భాగంగా దోమకొండలోని బురుజు వద్ద ఆయుధ పూజ చేస్తారు. ప్రతీ ఏటా స్థానిక సర్పంచి జాతీయ జెండాను ఎగురవేస్తారు. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవటంతో గ్రామ ప్రత్యేకాధికారి జాతీయ జెండావిష్కరణ చేయనున్నారు. అనంతరం జమ్మీ వృక్షానికి పూజ చేసి, చాముండేశ్వరి ఆలయానికి ఎదుర్కొని వెళ్తారు. ఇక్కడ జమి చెట్టును తాకి ఇంటికి తీసుకెళ్తే అదృష్టవంతులు అవుతారని నమ్మకంతో చాలా మంది పోటీ పడుతుంటారు. ఈ ఏడు సైతం ఉత్సవాలను విజయవంతంగా చేయటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పురాతన కట్టడాలు.. గత వైభవపు ఆనవాళ్లు


బాన్సువాడ బండగల్లీలోని బురుజు

బాన్సువాడ రూరల్: ఆనాటి సంస్థానాధీశులు తమ ఆధీనంలోని రాజ్యాన్ని శత్రువుల బారి నుంచి కాపాడుకునేందుకు కాపాలా కోసం పెద్ద పెద్ద బుర్జు(గడీ)లను నిర్మించారు. వృత్తాకార, చతురస్రాకార, దీర్ఘచతురస్రాకారాల్లో బురుజులను బండరాళ్ల 20 నుంచి 25 మీటర్ల ఎత్తులో మట్టి, సున్నంతో కలిపి నిర్మించారు. వీటిపైకి ఎక్కడానికి ఒకరు లేదా ఇద్దరు మాత్రమే వెళ్లడానికి మార్గం ఉంటుంది. వీటిపై నుంచి చూస్తే గ్రామ పొలిమేరలు స్పష్టంగా కనిపిస్తాయి. బురుజుల పై భాగంలో చుట్టూ రంధ్రాలుండే రాళ్లతో కూడిన కట్టడం ఉంటుంది. వీటిలో నుంచి సైన్యం తుపాకులను శత్రు సైన్యంపై ఎక్కు పెట్టేవారని పూర్వీకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాతబాన్సువాడ, బండగల్లీతో పాటు దేశాయిపేట్, పాత బాన్సువాడ, పోచారం, రాంపూర్, ఇబ్రహీంపేట్, బోర్లం, హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్ తదితర గ్రామాల్లో ఇప్పటికి బుర్జులు చెక్కుచెదరకుండా ఉన్నాయి. దసరా పండుగ నాడు వీటిపై జెండాలు ఎగురవేస్తారు. పోచారం గ్రామంలో ప్రతిఏటా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తమ ఇంటి ఆవరణలో ఉన్న బురుజుపై ఉన్న దస్తగిర్ దర్గాలో ఆనవాయితీగా ప్రార్ధన చేసి దసరా ఉత్సవాలను ప్రారంభిస్తారు.

మిషన్ భగీరథ ఫ్రీ వాటర్ సర్వీస్



రామారెడ్డి: దసరా పండుగకు వాహనాలను సర్వీసింగ్ చేయించుకోవడం, పూజ చేయించడం సాధారణం. మరి గురువారం దసరా పండుగ అయితే బుధవారమే చాలా మంది తమ వాహనాలను వాటర్ సర్వీసింగ్ చేయించుకుంటారు. కానీ రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ దగ్గర భగీరథ పైప్ లీకేజీతో వాహనాలు ఫ్రీ సర్వీసింగ్ అయ్యాయి. మిషన్ భగీరథ అంటేనే లీకేజీల భగీరథ అనే పేరు సార్థకమైంది. ఆ రోడ్డులో వచ్చిపోయే తమ వాహనాలను అక్కడ ఉంచి శుభ్రం చేసుకున్నారు.

గాంధీ జయంతి నాడే దసరా

- మాంసం విక్రయించొద్దని మున్సిపల్ అధికారుల నోటీసులు
- బెల్టుషాపులలో మద్యం స్టాక్ ఫుల్


నోటీసులు అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది


చికెన్ కొనుగోలు చేస్తున్న స్థానికులు

బిచ్కుంద(జుక్కల్): ఉద్యోగ, ఉపాధి, వ్యాపారం నిమిత్తం పట్టణాలకు వెళ్లిన వారు దసరా పండుగకు స్వగ్రామాలకు చేరుకున్నారు. బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. వాహనాలు, యంత్రాలకు పూజలు చేసి మాంసంతో వంటకాలు, మిత్రులతో కలిసి మద్యం సేవించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. కాగా, ఈసారి గాంధీ జయంతి రోజునే దసరా పండుగ వచ్చింది. దీంతో జీవహింస చేయొద్దని, మద్యం దుకాణాలను మూసి ఉంచాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. అయితే, పండుగ రోజు కూడా మద్యం, మాంసం ముక్క లేకుంటే ఎలా అంటూ ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.

మాంసం దుకాణాలకు నోటీసులు

ఈ నెల 2న గురువారం గాంధీ జయంతి సందర్భంగా మేకలు, కోళ్లు జీవహింస చేయవద్దని బుధవారం మున్సిపల్ అధికారులు మాంసం విక్రయ దుకాణదారులు, హోటళ్లకు నోటీసులు అందజేశారు. హోటళ్లలో సైతం మాంసం కూర వండరాదన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

బెల్టుషాపులలో స్టాక్...

గాంధీ జయంతి రోజున మద్యం విక్రయాలపై గ్రామాలలో అంతగా పట్టింపు ఉండదనే ఉద్దేశంతో బెల్టుషాపుల నిర్వాహకులు మద్యం బాటిళ్లను నిల్వచేసి పెట్టారు. పట్టణ, మండల కేంద్రాల నుంచి బెల్టు షాపులకు వచ్చి కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో బ్రాండెడ్ మద్యాన్ని తెచ్చిపెట్టినట్లు తెలిసింది. వైన్స్‌లు బంద్ ఉండడంతో అధిక ధరలకు విక్రయించి లాభం పొందవచ్చని నిర్వాహకులు భావిస్తున్నారు.

ప్రయాణం భారం..

- బస్సులు నడవక ఇబ్బందులు
- కామారెడ్డి, ఎల్లారెడ్డికి వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిందే
- పండుగల పూట ప్రయాణికులకు అవస్థలు

లింగంపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో నెల రోజులుగా రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఆగస్టు 27 నుంచి దాదాపు నెల రోజులకుపైగా కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లింగంపేట మండలం లక్ష్మాపూర్, అడ్విలింగాల వద్ద రోడ్డు కొట్టుకుపోయాయి. నాగిరెడ్డిపేట మీదుగా మెదక్, హైదరాబాద్ వెళ్లేదారిలో పోచారం ప్రాజెక్టు కింద వంతెనకు ఇరువైపులా రోడ్డు దెబ్బతిన్నది. దీంతో వారం, పది రోజులు రాకపోకలు నిలిచి ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగా మొరం వేసి రోడ్లు మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించారు. లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వాగు వంతెన, రోడ్డు కొట్టుకుపోవడంతో కామారెడ్డి నుంచి లింగంపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్‌కు ప్రతి రోజు నడిచే బస్సులను అధికారులు నిలిపివేశారు. సుమారు నెల పది రోజులు అవుతున్నా బస్సులు నడపడంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి నుంచి గాంధారి, నల్లమడుగు మీదుగా లింగంపేట, ఎల్లారెడ్డి మీదుగా పిట్లంకు మూడు బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సుల్లో వెళ్లాలంటే 30 కిలోమీటర్ల మేర దూరం, ఆర్థిక భారం పెరుగుతుంది. కామారెడ్డి నుంచి లింగంపేట మండలం పొల్కంపేట చౌరస్తా వరకు బస్సులు నడుపుతున్నారు. అక్కడి నుంచి ప్రయాణికులు మూడు కిలోమీటర్ల మేర ఆటోల్లో వెళ్లాల్సి వస్తుంది. ఇదే అదనుగా ప్రైవేటు వాహనాల్లో రెట్టింపు చార్జీ వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ఆర్థిక భారం, దూరం, సమయం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు. అయితే, రాకపోకలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు మరో 15 రోజులు పట్టవచ్చని అధికారులు చెప్తున్నారు.


లింగంపల్లి పాముల వాగు వద్ద కొనసాగుతున్న డైవర్షన్ రోడ్డు పనులు

అవస్థలు పడుతున్నాం



నెల రోజులుగా పొల్కంపేట వైపు బస్సులు రావడంలేదు. దీంతో లింగంపేటకు నడిచి వెళ్తున్నాం. ప్రైవేటు వాహనాల్లో చార్జీలు ఎక్కువగా తీసుకుంటున్నారు. నిత్యావసర సరుకులు, బట్టలు, పండుగ సామన్ల కొనుగోలుకు లింగంపేట వెళ్లాల్సి ఉంటుంది. పాముల వాగు వద్ద రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి.

– కంల్యానాయక్(ఒంటర్‌పల్లి)

నడవాల్సి వస్తోంది..



పొల్కంపేట రూట్‌లో బస్సులు నడవకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం లింగంపేట, కామారెడ్డికి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో మూడు, నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తుంది. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలంటే చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారు.

–వస్రాం(సురాయిపల్లి తండా)

క్రైం కార్నర్

చెరువులో పడి వ్యక్తి మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన జోగిని చిన్న మల్లయ్య(62) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. మృతుడు రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. బతుకమ్మ పండుగకు స్వగ్రామం వచ్చాడు. సెప్టెంబర్ 28న డబ్బుల విషయంలో భార్యతో గొడవపడి రంగంపేటలోని తన పెద్ద కొడుకు వద్దకు వెళ్లాడు. తిరిగి 30వ తేదీన అయిలాపూర్‌కు చేరుకున్నాడు. ఇంటికి వెళ్లకుండా గ్రామం పక్కనే ఉన్న చెరువులో బట్టలు ఉతుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటమునిగి చనిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పది నెలలకే నూరేళ్లు..

- జ్వరంతో బాలుడు మృతి


బాలుని మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మాచారెడ్డి : జ్వరంతో బాధపడుతూ పది నెలల బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని సర్దాపూర్ తండాలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్దాపూర్ తండాకు చెందిన బానోత్ అశోక్, వెన్నెల దంపతుల కుమారుడు వేదాంశ్(10 నెలలు) జ్వరంతో ఐదురోజులుగా బాధపడుతున్నాడు. దీంతో రాజన్నసిరిసిల్లా జిల్లా కేంద్రంలోని ఓ పిల్లల ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉందని నీలోఫర్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిరచారు.

వివాహిత ఆత్మహత్య

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన మమత(38) వరద కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై శైలేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మమత కొన్నాళ్లుగా కుటుంబకలహాలతో సతమతమవుతోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జీవితంపై విరక్తి చెంది ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే వరద కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రూ.2 వేల కోసం హత్య

- నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఒకటో టౌన్ పోలీసులు

ఖలీల్‌వాడి: రూ.2 వేల కోసం హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 6న నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనివాస కిరాణా షాప్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. అనుమానితుడైన నవీపేట మండలం జల్లపల్లి ఫారానికి చెందిన షేక్ అహ్మద్‌ను సెప్టెంబర్ 30న పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. షేక్ అహ్మద్ నగరంలోని రైల్వే స్టేషన్ పరిసరాల్లో నివసిస్తూ క్యాటరింగ్‌తోపాటు రోజువారీ కూలీ పనులు చేసేవాడు. మద్యం అలవాటు నేపథ్యంలో రైల్వేస్టేషన్ వద్ద ఒంటరిగా కనిపించే వ్యక్తులను బెదిరించి డబ్బులు దోచుకునే వాడు. గత నెల 6న అర్ధరాత్రి రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనివాస కిరాణా షాప్ ఎదుట ఒక వృద్ధుడు డబ్బులు లెక్కబెడుతూ కనిపించగా దోచుకోవాలనే ఉద్దేశంతో అహ్మద్ అతని దగ్గరకు వెళ్లాడు. డబ్బులివ్వాలని బెదిరించగా వృద్ధుడు ఇవ్వలేదు. దీంతో అహ్మద్ ఒక బట్టతో వృద్ధుడి మెడకు ఉరి బిగించి హత్య చేశాడు. అనంతరం అతని వద్ద నుంచి రూ.2 వేల నగదు, ఫోన్ దోచుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

వివాహితపై సామూహిక అత్యాచారం

ఆలస్యంగా వెలుగులో వచ్చిన ఘటన

నిజామాబాద్ రూరల్: వివాహితపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన వివాహిత నగరంలోని ఆటోనగర్‌లో నివాసం ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన మోయిన్‌తో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 10న ఆమెతోపాటు ఏడు సంవత్సరాల కుమారుడిని రూరల్ మండలంలోని ఓ గ్రామంలో అద్దె ఇంట్లో ఉంచాడు. అదే సమయంలో వివాహితపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం వివాహితను వాళ్ల అక్క వద్ద ఉంచాడు. సెప్టెంబర్ 27న ఆమెను నాగారం తీసుకెళ్లి మౌల్‌సాబ్‌ను కలిసి వస్తానని చెప్పి నిందితుడు పరారయ్యాడు.ఈ నేపథ్యంలో తనపై మోయిన్, అతని స్నేహితులు కయూమ్, అమీర్ కలిసి అత్యాచారం చేశారని బాధితురాలు సోమవారం పేర్కొన్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.కాగా, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని కాళికాదేవి మాత ఆలయంలో బుధవారం చండీ హోమం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు దినేష్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని పలు గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు దాండియా ఆడుతున్నారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల దుర్గామాత మండపంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులకు నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

రోడ్లకు మరమ్మతులు

రాజంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆరేపల్లి, తలమడ్ల మధ్య గల రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను ఆరేపల్లి గ్రామస్తులు,స్థానిక నాయకులు.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన తక్షణమే స్పందించి ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి తక్షణమే మరమ్మతులు చేయా లని ఆదేశించారు. దీంతో బుధవారం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో ఆరేపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బైక్-టిప్పర్ ఢీ.. ఒకరికి గాయాలు

మాక్లూర్: బైక్‌ను వెనుక నుంచి ఇటుక టిప్పర్ ఢీకొన్న ఘటన లో ఒకరికి తీవ్రగాయాలయ్యా యి. వివరాలు.. ధర్మోరాకు చెందిన నడ్పి సాయిలు బుధవారం బైక్‌పై నవీపేట మండలం కమలాపూర్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. మెట్‌పల్లి, వల్లభాపూర్ గ్రామాల మధ్యలో వెనుక నుండి వస్తున్న మినీ టిప్పర్ బలంగా ఢీకొట్టింది. దీంతో కల్లెం నడ్పి సాయిలు కాలు విరిగింది. గమనించిన వాహనదారులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

PASSPORT MISSING

కరికల సంతోష్ కుమార్ S/o. కరికల పోచయ్య R/o. H.No. 1-19/1, VI & MAN: Indalwai, NZB. మా ఇంటి నుండి ఇందల్వాయి స్టేషన్‌కి వెళ్ళే దారిలో C7312352 నెం॥ గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినచో సం: 9391349885. [SCA25008606]

CHANGE OF NAME

SAMEER AKBAR ALI CHARANIYA S/o. AKBAR ALI CHARANIYA R/o. H.No.7-14-761 Khoja Colony Nizamabad (D). Have Changed my Name as SAMEER CHARANIYA S/o. AKBAR ALI CHARANIYA. [SCA25008603]

RATHNAPURAM SOUJANYA D/o. RATHNAPURAM JOHN (Old name) R/o. H. No.1-13 Kukunoor (V), Vailpoor (M), Nzb (D). Have Changed my name as RATHNAPURAM SOWJANYA D/o. RATHNAPURAM GANGADHAR. [SCA25008614]

REAL ESTATE

LAND FOR SALE

భూములు & ప్లాట్లు కొనబడును@ మహేశ్వరం, మన్‌సాన్‌పల్లి,నాగారం,దూబచర్ల, అమీర్‌పేట్, కొత్తూర్, కందుకూర్, పులిమామిడి,తుక్కుగూడ, శ్రీశైలంహైవే.9966521191 [SCA25008607]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
Contact: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.